క్లుప్తంగా

రేషన్ దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

మిర్యాలగూడ : డివిజన్ పరిధిలోని పలు గ్రామాల్లో రేషన్ దుకాణాల ఏర్పాటుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మిర్యాలగూడ సబ్ కలెక్టర్ అమిత్‌నారాయణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మిర్యాలగూడ పట్టణంతో పాటు పది మండలాల పరిధిలోని పలు గ్రామాల్లో 30రేషన్ దుకాణాలను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. గుర్తించిన రిజర్వేషన్ ప్రకారం షాప్‌లు కేటాయించనున్నట్లు తెలిపారు. అర్హులైన వారు నిర్ధారిత రుసుము చెల్లించి ఈనెల 4 నుంచి 18వ తేదీ వరకు ఆయా మండలాల తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులను సమర్పించాలని తెలిపారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

వేములపల్లి : మండలంలోని లక్ష్మీదేవిగూడెంలో గిరిజన మహిళపై అత్యాచారం చేసిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు రెమడాల పరుశురాములు అన్నారు. శుక్రవారం ఆయన స్థానికంగా మాట్లాడుతూ అత్యాచారానికి గురైన మహిళకు ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం ప్రభుత్వం రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలన్నారు. ఆయన వెంటన తక్కెళ్లపల్లి శ్యామ్‌కుమార్ ఉన్నారు.

బీసీ అభ్యర్థిని నియమించాలి

మిర్యాలగూడ : నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలో బీసీ సంఘాల ఉమ్మడి అభ్యర్థిగా అవకాశం కల్పించాలని బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సర్నాల వెంకన్న ఎమ్మెల్సీ మల్లన్నను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మల్లన్న సానుకూలంగా స్పందించి అభ్యర్థిత్వాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సర్నాల వెంకన్న మాట్లాడుతూ బీసీలు రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలని, రాజకీయంగా, సామాజికంగా బీసీలు అణచివేతకు గురవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో గుడిపాటి కోటయ్య, ఆర్వ అశోక్, కట్టెబోయిన సైదులు, షేక్ ఉస్మాన్, శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యాదవ సంఘం అధ్యక్షుడిగా మల్లయ్య



డిండి : యాదవ సంఘం పట్టణ నూతన కమిటీని శుక్రవారం ఆ సంఘం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా భయ్య మల్లయ్య, ఉపాధ్యక్షులుగా వావిల్ల రేణయ్య, గౌడుగు మోహనయ్య, కార్యదర్శిగా జబ్బు విజయ్, సహాయ కార్యదర్శులుగా బద్దెల వెంకటయ్య, గౌడుగు శ్రీశైలం, కోశాధికారిగా దుడ్డు రాజేష్, సలహాదారులుగా వావిల్ల మల్లయ్య, నీరంజన్, రాములు, వావిల్ల సలయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



నఫ్రీద్

త్రిపురారం : నిడమనూరు మండలంలోని ముకుందాపురం గ్రామానికి చెందిన షేక్ నఫ్రీద్ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికై నట్లు నిడమనూరు మైనార్టీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ వెంకట్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 3, 4, 5వ తేదీల్లో మహబూబ్‌నగర్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో షేక్ నఫ్రీద్ పాల్గొంటారని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయికి ఎంపిక కావాలని కోరుతూ పాఠశాల ఉపాధ్యాయులు నఫ్రీద్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో పీఈటీ కోటేష్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి గాయాలు

అడవిదేవులపల్లి : పై కప్పు కూలి వృద్ధురాలికి గాయాలైన సంఘటన మండలంలో శుక్రారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.అడవిదేవులపల్లి మండలం మొల్కచర్ల గ్రామ పంచాయతీ పరిధిలోని బాలాజీతండాలో ఇంటి ముందు వరండాలో ధనావత్ ద్వాలీ పడుకొని ఉండగా ఆ క్రమంలో ఆకస్మాత్తుగా పై కప్పు కూలి ద్వాలీపై పడిపోవడంతో ఆమెకు కాలుతో పాటు శారీర భాగాలపై గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు గుర్తించి ఆమెను గ్రామంలోని ఆర్‌ఎంపీ వద్ద ప్రథమ చికిత్స చేసిన అనంతరం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. వృద్ధురాలికి ప్రాణాపాయం తప్పిందని వైద్యులు తెలిపారు. ఆమెకు ఒక్క కుమారుడు ఉండగా మూడేళ్ల కిందట చనిపోవడంతో కోడలు ఆమె వద్దనే ఉంటుంది. కాగా కోడలు ఆమె కూలి పనులకు వెళ్లిందని స్థానికులు పేర్కొన్నారు.

కొండచిలువ హతం

మిర్యాలగూడ : గ్రామంలోకి వచ్చి బాలుడిపై దాడికి యత్నించిన కొండచిలువను గ్రామస్తులు చంపిన ఘటన దామరచర్ల మండలం బాండావత్‌తండాలో శుక్రవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామ శివారులో చెట్ల పొదల నుంచి సుమారు పది అడుగుల కొండచిలువ గ్రామంలోకి ప్రవేశించి కోడిని చంపగా అక్కడే ఆడుకుంటున్న కొందరు చిన్నారుల్లో ఒక చిన్నారి వెంట కొండచిలువ పడడంతో బాలుడు కుటుంబ సభ్యులకు తెలిపాడు. దీంతో గ్రామస్తులు కొండచిలువను కర్రలతో కొట్టి చంపారు.

విత్తనాభివృద్ధి సంస్థ ఎత్తివేత

- నిడమనూరు నుంచి నందిపాడులోని ప్రాసెసింగ్ సెంటర్‌కు తరలింపు
- శుక్రవారం నుంచే సేవలు బంద్
- నిడమనూరులోనే కొనసాగించాలని రైతుల వేడుకోలు



నిడమనూరులోని తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ

త్రిపురారం : నాగార్జున సాగర్ నియోజక వర్గంలోని నిడమనూరు మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ నలబై ఏళ్లుగా కొనసాగుతుంది. అనుముల, త్రిపురారం, నిడమనూరు మండలాలు సాగర్ ఎడమ కాల్వ కింద ఉండడంతో ఇక్కడ వరి పండించే రైతులు అధికం. మెట్ట ప్రాంత రైతులు కూడా ఉపయోగకరంగా ఉండేది. ఈ ప్రాతం రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలనే ఉద్దేశంతో ఆనాటి వ్యవసాయ శాఖ మంత్రి జానారెడ్డి 1992లో ఏపీ సీడ్స్ జిల్లా యునిట్ కార్యాలయాన్ని నిడమనూరులో ఏర్పాటు చేశారు. తెలగాణ రాష్ట్ర ఏర్పడిన తరువాత తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థగా రైతులకు సేవలు అందిస్తుంది. దీంతో మూడు మండలాల ప్రజలకు విత్తనాభివృద్ధి సంస్థలో విత్తనాలు అందుబాటులో ఉండడం వల్ల ప్రయోజకరంగా ఉండేది. అయితే ఉమ్మడి నల్లగొండ జిల్లాలోనే సుమారు 165 మంది రైతులు వాటాదారులుగా ఉన్న విత్తనాభివృద్ధి సంస్థగా కూడా గుర్తింపు పొందింది. దీంతోపాటుగా ప్రభుత్వ సబ్సిడీ విత్తనాలకు కూడా ఈ కార్యాలయం సేవలు వినియోగించేవారు. అలాంటి విత్తనాభివృద్ధి సంస్థను నిర్వహణ భారం కారణం చూపుతూ విత్తన ప్రాసెసింగ్ యూనిట్, రిజనల్ కార్యాలయాన్ని మిర్యాలగూడ నియోజక వర్గంలోని నందిపాడులో ఉన్న ప్రాసెసింగ్ కార్యాలయానికి తరలించేందుకు ఆక్టోబర్ 13న విత్తనాభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో అధికారులు విత్తనాభివృద్ధి సంస్థను నందిపాడుకు తరలించారు. మూడు మండలాల ప్రజలకు విత్తనాల విషయంలో ఇబ్బందులు తలెత్తె అవకాశం ఉండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నవంబర్ 01 నుంచి పూర్తి స్థాయిలో నిడమనూరులోని విత్తనాభివృద్ధి సంస్థను సంబంధిత అధికారులు మూసివేయడంతో రైతులకు విత్తన సేవలు నిలిచిపోయాయి. నిడమనూరు విత్తన కేంద్రం మూసి వేస్తే రైతులకు ఇబ్బందులు తప్పవని రైతులు వాపోతున్నారు. ప్రజా ప్రతినిదులు పట్టించుకోవాలని వేడుకుంటున్నారు.

గతంలోనూ మూసివేతకు యత్నం

విత్తనాభివృద్ధి సంస్థను అప్పట్లో అద్దె భవనంలో ఏర్పాటు చేయడంతో పాటుగా గతంలో మాదిరిగా రైతులు విత్తనాలు కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపకపోవడం వల్ల నష్టాలు వస్తుండడంతో అధికారులకు ఇక్కడ కొనసాగించడం భారంగా మారింది. దీంతో నందిపాడులో సొంత భవనం విత్తన ప్రాసెసింగ్ ప్రాడక్టులు ఉండడంతో నందిపాడు తరలించడానికి నిర్ణయం తీసుకున్నట్లు సంబందిత అధికారులు తెలిపారు. 2017లోను మూసి వేయడానికి ప్రయత్నాలు జరగడంతో రైతులు ఆందోళన చేయడంతో విరమించుకున్నారు. తిరిగి నవంబర్–2024 నుంచి విత్తన సేవలు పూర్తి స్థాయిలో నిలిచిపోయాయి. రైతులు ఆందోళనలు చేయడానికి సిద్ధమవుతున్నారు. ఇటీ వల కేంద్రాన్ని తరలించవద్దని మండలంలోని పలువురు రైతులు తహసీల్దార్‌కు వినతిపత్ర అందజేశారు.

నిడమనూరులోనే కొనసాగించాలి



“ రైతులకు అందుబాటులో ఉన్న విత్తనాభివృద్ధి కార్యాలయాన్ని నిడమనూరులేనే కొసాగించాలి. దూర ప్రాంతానికి తరలివెళ్లితే ఇక్కడి ప్రాంత రైతులకు ఇబ్బందికరంగా ఉంటుంది. ప్రజా ప్రతినిధులు పట్టించుకోవాలి.

– కురాకుల వెంకటేశ్వర్లు, రాజన్నగూడెం

రైతులకు ఉపయోగంగా ఉండేది



ప్రభుత్వ విత్తనాభివృద్ధి సంస్థ నిడమనూరులోనే ఉంటే త్రిపురారం మండల రైతులకు కూడా ఉపయోగంగా ఉండేది. మిర్యాలగూడ మండలంలోని నందిపాడుకు వెళ్తే రైతులు వినయోగించుకోలేరు. సాగర్ నిరొజకవర్గంలో ఒక్కటే ఉంది కావున నిడమనూరులో కొనసాగించాలి.

అనుముల సుధాకర్ రెడ్డి, రైతు, త్రిపురారం.

ఘనంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం



కల్యాణం సందర్భంగా స్వామివారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



స్వామివారి కల్యాణంలో పాల్గొన్న ఎంపీ రఘువీర్‌రెడ్డి, శరత్‌నాయక్ దంపతులు

మిర్యాలగూడ : దామరచర్ల మండలం వాడపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం స్వామి కల్యాణాన్ని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ కుందూరు రఘువీర్‌రెడ్డి దంపతులు, జాతీయ గిరిజన విద్యార్థుల విద్యా సంఘం స్టీరింగ్ కమిటీ సభ్యుడు అడావత్ శరత్‌నాయక్ దంపతులు పాల్గొని స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వారిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాలధారులతో పాటు పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చారు. కార్యక్రమంలో జిల్లా అదనపు న్యాయమూర్తి వేణు, డీసీసీ అధ్యక్షుడు కెతావత్ శంకర్‌నాయక్,తదితరులు పాల్గొన్నారు.

సూపర్‌వైజర్లపై సబ్ కలెక్టర్ అసంతృప్తి



సమావేశంలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

మిర్యాలగూడ : మిర్యాలగూడ మున్సిపల్ పరిధిలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేకు 29 మంది సూపర్‌వైజర్లలో 8మంది హాజరు కావడంపై సబ్ కలెక్టర్ అమిత్‌నారాయణ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక ఏఆర్‌సీ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన సబ్ డివిజన్ పరిధిలోని అధికారుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఈనెల 6నుంచి ప్రారంభమయ్యే సర్వే విషయంలో సామగ్రి పంపిణీ నుంచి పర్యవేక్షణ ఉండాలన్నారు. పద్దతి ప్రకారం కార్యాచరణ ప్రణాళిక ఉండాలన్నారు. ప్రతి బ్లాక్‌పై పర్యవేక్షణ ఉండాలన్నారు. సర్వేను పకడ్బందీగా, పారదర్శకంగా, జాగ్రత్తగా చేయాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ హరిబాబు, ఏడీఏ దేవ్‌సింగ్, మున్సిపల్‌కమిషనర్ యూసుఫ్, జెడ్పీ డిప్యూటీ సీఈఓ శ్రీనివాస్‌రావు, డీటీడబ్ల్యూఓ రాజ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

రామానుజాచార్యులు జీవితం ఆదర్శనీయం



క్రీడా పోటీలు ప్రారంభిస్తున్న మాజీ మంత్రి జానారెడ్డి

హాలియా : జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత దివంగత రామాజనుజాచార్యులు జీవితం ఆదర్శనీయమని మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి అన్నారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ముడుంబై రామానుజాచార్యులు ప్రథమ వర్ధంతి సందర్భంగా పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో శుక్రవారం హాలియా జెడ్పీహెచ్‌ఎస్‌లో నిర్వహిస్తున్న నియోజకవర్గ పాఠశాలల స్థాయి కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యారంగంతో పాటు సామాజికరంగంలో ఎనలేని సేవలు అందించినట్లు తెలిపారు. అనంతరం క్రీడా పోటీల్లో గెలుపొందిన జట్లుకు జానారెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్లు చంద్రశేఖర్ రెడ్డి, చంద్రశేఖర్, వెంకట్‌రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చంద్రారెడ్డి, నాయకులు లింగారెడ్డి, నారాయణ గౌడ్, నరేందర్‌రెడ్డి, శ్రీనివాస్, గౌనీరాజా రమేష్ యాదవ్, శ్రీనివాస్, ఎంఈఓలు గుండా కృష్ణమూర్తి, శ్రీనివాస్, పూర్వ విద్యార్థులు, ఉన్నారు.

ప్రతి ఇంటికీ సర్వే స్టిక్కర్ అతికించాలి



మిర్యాలగూడ టౌన్ : సర్వే మెటీరియల్‌ను అందజేస్తున్న తహసీల్దార్, కమిషనర్



తిరుమలగిరి(సాగర్) : ఇంటింటి సర్వేను పరిశీలిస్తున్న అడిషనల్ పీడీ శారద

మిర్యాలగూడ టౌన్ : ఎన్యూరేటర్లు మొదట విడతలో ఈనెల 3వ తేదీ వరకు సర్వే చేసి స్టిక్కర్లు అతికించాలని మండల తహసీల్దార్ హరిబాబు, మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్ అన్నారు. శుక్రవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో అదనపు సూపర్‌వైజర్లకు నిర్వహించిన శిక్షణతో పాటు సర్వేకు సంబంధించిన మెటీరీయల్‌ను పంపిణీ చేశారు. ఈ సర్వేలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా ఎన్యూరేటర్లు జాగ్రత్తగా చేయాలన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు దేవ్‌సింగ్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ వెంకటరమణ, మెప్మా టీఎంసీ బక్కయ్య, టీటీపీఎస్ అంజయ్యలతో పాటు ఉపాధ్యాయులు, ఆర్‌పీలు, మున్సిపల్ సిబ్బంది తదితరులున్నారు.

దేవరకొండ : ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని దేవరకొండ ఆర్డీఓ రమణారెడ్డి అన్నారు.శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న ఇంటింటి సర్వే ఆయన పరిశీలించి మాట్లాడారు.ఎన్యూమరేటర్లు వారికి కేటాయించిన ఇళ్లకు వెళ్లి పక్కాగా క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించాలని ఆయన అన్నారు.భవిష్యత్‌లో ప్రభుత్వం నుంచి పొందే లబ్ధి కొరకు మాత్రమే సర్వే నిర్వహిస్తున్నట్లు ప్రజలకు తెలియజేస్తూ వివరాలను సేకరించాలని ఆయన పేర్కొన్నారు. దాదాపు రెండు వారాల పాటు కొనసాగే ఇంటింటి కుటుంబ సర్వేలో పొరపాట్లకు తావు లేకుండా ఉండాలని ఆయన సూచించారు. ఆయన వెంట మున్సిపల్ కమీషనర్ సుదర్శన్,మున్సిపల్ సక్రునాయక్, జగమంతు ఉన్నారు.

యజమాని వివరాలను సేకరించాలి

అడవిదేవులపల్లి : సామాజిక సర్వేలో భాగంగా ఈనెల 3వ తేది వరకు ప్రతి ఇంటికి వెళ్లి యాజమాని పేరును సేకరించి స్టిక్కర్ అతికించాలని మండల తహసీల్దార్ సురేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కులగణనలో భాగంగా ఎన్యూమరేటర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ అమీర్ అలీ, పంచాయతీ కార్యదర్శులు శ్రీనివాస్‌లతో పాటు పలువురు సిబ్బంది తదితరులున్నారు.

వేములపల్లి : రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 6 నుంచి చేపట్టనున్న కులగణను ఎన్యూమరేటర్లు పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ కోటేశ్వరి, ఎంపీడీఓ శారదాదేవిలు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఎన్యూమరేటర్లకు సర్వే సామాగ్రిని అందచేసి వారు మాట్లాడారు. తమ గ్రామాల్లో కేటాయించిన ఇంటింటికి వెళ్లి ఫారాల్లో ఉన్న 75రకాల ప్రశ్నలకు సంబంధించిన పూర్తి వివరాలను సేకరించి అందులో పొందుపరచాలన్నారు . మండలంలో 12 గ్రామపంచాయతీల పరిధిలో సుమారు 36,175కుటుంబాలు ఉండగా 54 మంది ఎన్యూమరేటర్లను, సర్వే పర్యవేక్షణకు ఆరుగురు సూపర్‌వైజర్లను నియమించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ లలిత, కార్యదర్శులు శ్రవణ్, ఎన్యూమరేటర్లు పాల్గొన్నారు.

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : ఇంటింటి సర్వేను శుక్రవారం మండల కేంద్రంలో మండల ప్రత్యేక అధికారి డీఆర్‌డీఏ అదనపు పీడీ శారద ప్రారంభించారు. గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మల్లీశ్వర్, డిప్యూటీ తహసీల్దార్ నాగమణి, మండల పంచాయతీ అధికారి బిక్షంరాజు పాల్గొన్నారు.

ఘనంగా ఏక్తా దివస్



పెద్దవూర : ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

దేవరకొండ : రాష్ట్రీయ ఏక్తా దివస్‌ను గురువారం దేవరకొండ మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించా రు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నరసింహ సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ రహత్‌అలీ, ఏఈ రాజు, సక్రునాయక్, రవికుమార్ ఉన్నారు.

పెద్దవూర : మండలంలోని చలకుర్తి క్యాంపు జవహర్ నవోదయ విద్యాలయంలో గురువారం సర్దార్ వల్లభాయి పటేల్ జయంతి సందర్భంగా ఏక్తా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి అనంతరం ర్యాలీ నిర్వహించారు. పటేల్ జీవిత చరిత్రపై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం పోటీలను నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనపర్చిన వారికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో విద్యాలయం వైస్ ప్రిన్సిపాల్ స్వర్ణలత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే



బాధితుడిని కారులో ఆస్పత్రికి పంపిస్తున్న ఎమ్మెల్యే

మిర్యాలగూడ అర్బన్ : రెండు ద్విచక్రవాహనాల ఢీకొన్న ఘటనలో తీవ్ర గాయాలైన బాధితుడిని శుక్రవారం మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి తన వాహనంలో ఎక్కించి ఆస్పత్రికి చేర్పి మానవత్వం చాటుకున్నారు. వివరాల్లోకి వెళితే.. గురువారం మధ్యాహ్నం మిర్యాలగూడ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రధాన రోడ్డుపై ఎదురెదురుగా వేగంగా వస్తున్న ద్విచక్ర వాహనాలు ఢీ కొన్నాయి. ఈ సంఘటనలో ఒకరికి గాయాలు కావడంతో అదే సమంలో ఆ రోడ్డుగుండా వస్తున్న ఎమ్మెల్యే కారును ఆపి బాధితుడిని చూశాడు. గాయాలపాలైన అతడిని తన కారులోకి ఎక్కించి స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. సకాలంలో స్పందించి బాధితుడిని కారులో ఆస్పత్రికి తరలించడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

కార్మికులకు చేయూత అభినందనీయం



నిత్యావసర వస్తువులు అందజేస్తున్న ఎస్‌ఐ

హాలియా : పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు ప్రభుత్వ ఉపాధ్యాయుడు మందా సైదులురావు గౌతమ్ చేయూతనందించడం అభినందనీయమని హాలియా ఎస్‌ఐ సతీష్‌రెడ్డి అన్నారు. దీపావళి సందర్భంగా అనుముల మండలంలోని నాయుడుపాలెం గ్రామంలో మందా రామయ్య, బిక్షమమ్మ జ్ఞాపకార్ధం కుమారుడు ప్రభుత్వ ఉపాధ్యాయుడు సైదులురావు గౌతమ్ ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామ పారిశుద్ధ్య కార్మికులు, నిరుపేదలకు నిత్యావసర వస్తువులను ఎస్‌ఐ సతీష్‌రెడ్డి పంపిణీ చేసి మాట్లాడారు. ఈ కార్యక్రమం లో నాయకులు కందుల మదన్‌రెడ్డి, సైదులురావు గౌతమ్, మందా జయంత్ రామ్, విశ్రాంత ఏఎస్‌ఐ యడవెల్లి సోమశంకర్, జాతీయ కబడ్డీ క్రీడాకారుడు రాంబాబు, మాజీ సర్పంచ్ చంద్రకళ కిరణ్, నాయకులు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీ ఆశయ సాధనకు కృషిచేయాలి



ఇందిరాగాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు

మిర్యాలగూడ : మాజీ ప్రధాని ఇందిరాగాంధీ ఆశయసాధన కోసం ప్రతి ఒక్కర కృషిచేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆమె చిత్రపటానికి, సాగర్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. ఇందిరాగాంధీ భారతదేశానికి ఎనలేని సేవలు చేసి ఉక్కు మహిళగా పేరొందారని అన్నారు. అదేవిధంగా దామరచర్లలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గాజుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ చిత్రపటం వద్ద పలువురు నివాళులర్పించారు. కార్యక్రమంలో పగిడి జీడయ్యయాదవ్, కందుల నరసింహారెడ్డి, గాలం వెంకన్న, సయ్యద్‌ఖాదర్, ఆకారపు గోపాల్, కొమ్ము దాసు, సదానందం, బత్తిని వెంకటేశ్వర్లు, శంభయ్య, గాలిబ్, రామకృష్ణ, సద్దాం పాల్గొన్నారు.

కార్మికులకు అండగా ఏఐటీయూసీ



దేవరకొండ : ఏఐటీయూసీ జెండా ఆవిష్కరిస్తున్న ప్రజా నాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి నర్సింహ

దేవరకొండ : కార్మికుల హక్కుల కోసం ఏఐటీయూసీ నిరంతరం పోరాడుతుందని ప్రజానాట్య మండలి రాష్ట్ర కార్యదర్శి పల్లె నర్సింహ అన్నారు. గురువారం పట్టణంలోని పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో ఏఐటీయూసీ 105వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించా రు.ఈ సందర్భంగా ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. కార్మికుల హక్కులను సాధించడానికి దేశంలో ఏర్పడిన తొలి కార్మిక సంఘం ఏఐటీయూసీ అన్నారు. ఇటీవల నూతనంగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూ సీ జిల్లా అధ్యక్షుడు నూనె రామస్వామి,దేప సుదర్శన్‌రెడ్డి,పల్లా రంగారెడ్డి, నీలా వెంకటయ్య, మైనొద్దీన్, అలమోని మల్లయ్య, పగిళ్ల బుచ్చయ్య పాల్గొన్నారు.

ఘనంగా ఏఐటీయూసీ ఆవిర్భావ వేడుకలు

డిండి : ఏఐటీయూసీ 105వ ఆవిర్భావ వేడుకలు శుక్రవారం మండలంలో ఆ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నూనె వెంకటేశ్వర్లు ముఖ్య అతిధిగా హాజరై ఆ సంఘం జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కనకాచారి, ఐఏవైఎఫ్ జిల్లా జిల్లా ఉపాధ్యక్షుడు నవీన్, వంకేశ్వరం చక్రి, ఆ సంఘం మండలాధ్యక్షుడు బూషిపాక లింగమయ్య, దేవయ్య, జోహార్, వెంకటయ్య, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

దేశంలో మొట్టమొదటి కార్మిక సంఘం ఏఐటీయూసీ

చింతపల్లి : దేశంలోనే మొట్టమొదటి కార్మిక సంఘం ఏఐటీయూసీ అని ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి చెల్లా పాండురంగారావు అన్నారు. ఏఐటీయూసీ 105వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా శుక్రవారం మండల పరిధిలోని మాల్ వీటీ నగర్‌లో ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో హమాలీ యూనియన్ నాయకులు అంజయ్య, ఆనంద్,దుర్గయ్య గ్రామ పంచాయతీ కార్మికులు యాదయ్య, వెంకటమ్మ, నరసింహ్మ, భారతమ్మ,మంజుల, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ అర్బన్ : కార్మికులు తమ హక్కుల పరిరక్షణకు ఐక్య ఉద్యమాలు చేయాలని ఏఐటీయూసీ డివిజన్ కార్యదర్శి ఎండీ సయిద్ అన్నారు. శుక్రవారం ఏఐటీయూసీ 105 వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కారు, జీపు అడ్డా వద్ద జెండా ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బంటు వెంకటేశ్వర్లు, నాయకులు వెంకన్న, వినోద్‌నాయక్, గోపాల్, అలీ, బుచ్చిరాములు, సైదులు, వెంకన్న, శ్రీనివాస్ పాల్గొన్నారు.

వైభవంగా మహబూబ్ సుహానీ దర్గా గంధోత్సవం



గంధాన్ని ఊరేగిస్తున్న ముస్లిం, మైనార్టీ కమిటీ సభ్యులు

డిండి : గ్యార్మీ మాసాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని మహబూబ్ సుహానీ దర్గా గంధోత్సవ కార్యక్రమాన్ని గురువారం డిండి పట్టణ ముస్లిం, మైనార్టీ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక షాదీఖానా నుంచి సాయంత్రం బయలుదేరిన స్వామి వారి గంధోత్సవం ఖవ్వాలి భక్తి పాటలు, డప్పు చప్పుళ్ల నడుమ ఊరేగిస్తూ అర్ధరాత్రి వరకు దర్గాకు చేరుకుంది. స్వామికి గంధం, దట్టీలు, పూలు, మాలీదా సమర్పించి భక్తులు తమ మొక్కులను తీర్చుకున్నారు. శుక్రవారం దర్గా వద్ద భక్తులకు అన్నదానం చేశారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, సాయి, కాశన్న, రాములు, శ్రీనివాస్‌గౌడ్, లక్ష్మణ్, సలయ్య, బీఆర్‌ఎస్ నాయకులు వడ్త్య రమేష్ నాయక్, శ్రీను, ముస్లిం, మైనార్టీ కమిటీ అధ్యక్షుడు ఉమర్, ప్రధాన కార్యదర్శి ఖయ్యూం, రషీదు, ఖలీం, చాంద్‌పాషా, నసీర్, నీరంజన్,ఖాదర్, జావద్, బాబా, జహంగీర్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు అడ్డంగా కడీలు



రోడ్డుకు అడ్డంగా కడీలు పాతిన ఆక్రమణదారుడు

కొండమల్లేపల్లి : పట్టణ కేంద్రంలోని పాత ఊరులోని ఒకటో వార్డులో ఒక వ్యక్తి రోడ్డును ఆక్రమించుకొని కడీలు నాటాడు. రోడ్డు వేసిన భాగం తనకే చెందిందని.. కడీలు పాతడం గమనార్హం. 2016లో సీసీ రోడ్డు, ఇటీవల కాలంలో అండర్‌గ్రౌండ్ డ్రైయినేజీ పనులు చేసినప్పుడు స్పందించిన సదరు వ్యక్తి తాజాగా ఆ స్థలం తనకే చెందిందని పేర్కొంటూ కడీలు పాతడం చర్చనీయాంశమైంది. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి డాకునాయక్‌ను వివరణ కడీలు పాతిన వ్యక్తితో మాట్లాడి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

బీసీ గర్జనకు ఆహ్వానం లేకపోవడం బాధాకరం

మిర్యాలగూడ : ఈనెల 3న చేపట్టనున్న బీసీ గర్జణకు తనకు కనీసం ఆహ్వానం అందించకపోవడం బాధాకరమని సింగిల్‌విండో చైర్మన్ బంటు శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలో 25ఏళ్లుగా బీసీ ఉద్యమంలో చురుకుగా పాల్గొంటూ సింగిల్‌విండో చైర్మన్‌గా పనిచేశానన్నారు. బీసీలను ఐక్యపరిచేందుకు చేపట్టే కార్యక్రమాల్లో పార్టీలకతీతంగా అన్ని పార్టీల వారిని కలుపుకుకోవాల్సిన నిర్వాహకులు కొందరికే అవకాశం కల్పించడం బాధాకరమన్నారు. సభ నిర్వాహకుల్లో ఎవరూ కనీసం పదవుల్లో లేరని, తాను మాత్రమే ప్రస్తుతం పదవిలో ఉన్నానని, కనీసం తనను కార్యక్రమాలకు ఆహ్వానించకపోవడం వారి అవివేకమన్నారు.

బీసీ గర్జన పోస్టర్ ఆవిష్కరణ

మిర్యాలగూడ టౌన్ : ఈ నెల 3న నిర్వహించే బీసీ గర్జన పోస్టర్‌ను విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో వాల్ పోస్టరును బీసీ జేఏసీ నేత తమ్మడబోయిన అర్జున్ శుక్రవారం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో మండల విశ్వబ్రహ్మణ సంఘం అధ్యక్షులు శివరసనగండ్ల ఈశ్వరాచారి, జిల్లా, రాష్ట్ర నాయకులు సైదాచారి, గోవర్ధనాచారి, లక్ష్మణ్, తరుణ్, యాదగిరి, దుర్గాప్రసాద్, పాలకి నాగేంద్రాచారి, బ్రహ్మచారి, భీష్మాచారి, వెంకన్న పాల్గొన్నారు.

హక్కుల సాధనకు బీసీలు ఏకం కావాలి

హక్కుల సాధన కోసం బీసీలందరూ ఏకం కావాలని బీసీ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాపోలు పరమేశ్ అన్నారు. శుక్రవారం స్థానిక సంఘం కార్యాలయంలో నిర్వహించిన ఉద్యోగుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీల సమస్యలపై పోరాటాలు చేయనిదే ఏ ప్రభుత్వం కూడా పరిష్కారం చేయవన్నారు. ఈ సమావేశం అనంతరం నూతనంగా ఎన్నికైన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మాసన శ్రీనివాస్‌ను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకన్న యాదవ్, కోటయ్య, జానయ్య, యోగేందర్, రవీందర్, అనిల్ ఉన్నారు.

కాల్వ పూడికతీత పనులు ప్రారంభం

తిరుమలగిరి(నాగార్జునసాగర్) : నాగార్జునసాగర్ ఎడమ కాల్వ ఆయకట్టు పరిధిలోని మొదటి మేజరైన రాజవరం కాల్వ పూడిక తీత పనులను గురువారం హాలియా వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ కంసాని చంద్రశేఖర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజవరం మేజర్ కాల్వలో నాచు ,గుర్రపుడెక్కలు విపరీతంగా పెరగడంతో రాజవరం చివరి మేజర్ వరకు సాగు నీరు వెళ్లక పోవడంతో స్థానిక రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుక వెళ్లారు. ప్రస్తుతం పంట పొలాలు పొట్టదశలో ఉండటంతో సాగునీరు అందక ఎండి పోతున్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకోని స్థానిక రైతుల కోరిక మేరకు స్థానిక ఎమ్మెల్యే సొంత నిధులతో పూడికతీత పనులను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజవరం మాజీ ఎంపీటీసీ నెమలి శ్రీదర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి,గోపి,అక్రం, వర్క్ ఇన్స్పెక్టర్ షర్ఫోద్దీన్ పాల్గొన్నారు.